

ఇసుక అక్రమ రవాణాపై నిర్లక్ష్యం వద్దు : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉచిత ఇసుక విధానం అమలవుతున్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, అక్రమ రవాణాపై ఎక్సైజ్, పోలీసు అధికారులు నిర్లక్ష్యం తగదని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ధ్వజమెత్తారు. టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే రాజంపేటకు ఇసుక రీచ్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతామని, తొందరలోనే ఇసుక అందుబాటులోకి తీసుకువస్తామని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఆకేపాటి మాజీ డైరెక్టర్ గుల్జార్‌బాషా, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఎస్‌కె.కరీమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

కదులుతున్న డొంక

- పోలీసుల అదుపులో 'పెద్దిరెడ్డి' అనుచరులు
- మున్సిపల్ వైస్ చైర్మన్ జంగా వెంకట చలపతి, మిట్టపల్లె సర్పంచ్ భర్త అక్కులప్పను విచారిస్తున్న పోలీసులు
- మరి కొంతమంది కోసం గాలిస్తున్న పోలీసులు
- అజ్ఞాతంలోకి ఎపిఎండిసి మాజీ చైర్‌పర్సన్ షమీమ్ అస్లామ్, బాబ్‌జాన్
- కొనసాగుతున్న విచారణ
- సబ్ కలెక్టరేట్‌కు పెరిగిన బాధితుల తాకిడి



సబ్ కలెక్టరేట్‌లో దగ్ధమైన ఫైళ్లు (ఫైల్ ఫోటో)



పోలీసుల అదుపులో ఉన్న అక్కులప్ప, వెంకట చలపతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల ఘటన కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జంగా వెంకటచలపతి ఇంట్లో సోదాలు చేపట్టిన అధికారులు పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శనివారం తెల్లవారుజాము రెండు గంటల ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇతను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ముఖ్య అనుచరుడు కావడం గమనార్హం. మరో ముఖ్య అనుచరుడు, పిఆర్‌ఒగా పనిచేసిన సిటిఎం మిట్టపల్లె సర్పంచ్ ఈశ్వరమ్మ భర్త బండపల్లె అక్కులప్ప ఇంట్లో సైతం అధికారులు సోదాలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూ కుంభకోణాల్లో అత్యంత కీలకంగా వ్యవహరించాడన్న కోణంలో బండపల్లె అక్కులప్పను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇప్పటికే పూర్వపు ఆర్‌డిఒలు మురళీ, హరిప్రసాద్‌లను దస్త్రాల దహన ఘటనలో ముఖ్య భూమిక పోషించారన్న అనుమానం ఉన్న సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను పోలీసులు తమ అదుపులో పెట్టుకుని విచారిస్తున్న సంగతి తెలిసిందే. అనంతరం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న పలువురు తహశీల్దార్లు డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్‌ఐలు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, కార్యాలయ సిబ్బందిని జిల్లా రెవెన్యూ ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలోని దర్యాప్తు బృందాలు విచారించాయి. మదనపల్లె రెవెన్యూ డివిజన్ లోని 11 మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లోనూ సోదాలు చేపట్టి, అన్ని రికార్డులను పరిశీలించారు. మదనపల్లె రిజిస్ట్రర్ కార్యాలయంలోనూ పలు రికార్డులను తనిఖీ చేశారు. మూడు రోజులుగా భూ బాధితులు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తమ భూములను వైసిపి నేతల దౌర్జన్యాల వల్ల కోల్పోయామని వందలకొద్దీ అర్జీలను ఇస్తున్నారు. ఇందులో ఎక్కువగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు చేసిన కుంభకోణాలు ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు అధికారులు ముందుకు కొనసాగుతున్నారు. దౌర్జన్యాలు, కబ్జాల వల్ల భూములు కోల్పోయామని వచ్చిన అర్జీలే ఎక్కువ అని రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియా సైతం స్పష్టం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు రైస్‌మిల్ మాధవరెడ్డి పేరు ఎక్కువగా వినపడటంతో ఆయన ఇంట్లో రెవెన్యూ అధికారులు సోదాలు చేసి పలు రికార్డులు, కంప్యూటర్లు, హార్డ్ డిస్కులను సీజ్ చేశారు. ఆయన పోలీసులకు, దర్యాప్తు అధికారులకు దొరకకుండా పరారీలో ఉన్నారు. ఇదే కోవలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరుడు తట్టివారిపల్లికి చెందిన బాబ్‌జాన్ గృహంలో సోదాలు నిర్వహించేందుకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ప్రయత్నించగా ఇక్కడ తాళాలు వేయడంతో వెనుతిరిగారు. వైసిపి ముఖ్య నాయకులు, వైసిపి ప్రభుత్వంలో ఎపిఎండిసి చైర్‌పర్సన్‌గా విధులు నిర్వహించిన మదనపల్లె మాజీ మున్సిపల్ చైర్మన్ షమీమ్ అస్లాం అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో విజయవాడలోని మైన్స్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కూడా చైర్‌పర్సన్‌గా ఉన్న షమీమ్ అస్లామ్ పాత్ర ఎంత వరకు ఉందో అధికారులు తేల్చాల్సి ఉంది. ఈ తరుణంలో మదనపల్లె స్థానికురాలైన షమీమ్ అస్లాం దేశం విడిచి విదేశాల్లో తల దాచుకున్నట్లు వార్తలు వినబడుతున్నాయి. పోలీసులు మాత్రం తమ విచారణను ఏమాత్రం బయటకు పొక్కకుండా గోప్యంగా నిర్వహిస్తున్నారు. మదనపల్లె చెందిన మరికొంత మంది వైసిపి నాయకులు, ఎక్కువగా భూ వివాదాల్లో తల దూర్చిన పలువురి నాయకులపై కూడా పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో కొంత మంది నాయకులు ఇప్పటికే పట్టణం వదలి అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం. సబ్ కలెక్టర్ కార్యాలయం దహన ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని రాష్ట్ర డిజిపి, సిఐడి చీఫ్‌ను మదనపల్లికి పంపినా, రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియా మదనపల్లెలోనే మూడు రోజులు మకాం వేసి విచారణ చేపట్టినా, అన్ని కోణాల్లో పోలీసులు, ఇతరత్రా అధికారులు విచారణలు జరిపిన ఇంతవరకు సబ్ కలెక్టర్ కార్యాలయ దహన ఘటన కొలిక్కి రాకపోవడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పోలీసులు మాత్రం దర్యాప్తును కొనసాగిస్తున్నామని, దర్యాప్తు ఎప్పుడు పూర్తి చేస్తామో ఇప్పుడే చెప్పలేమని ఎసిపి విద్యాసాగర్ నాయుడు ఇప్పటికే స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసిన తర్వాతే బాధ్యుల్ని అరెస్టు చేస్తామని విలేకరులకు తెలిపారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియా మాట్లాడుతూ 2.16 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్‌లో ఉన్నాయని అందులో 4,400 ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది చేతివాటం స్పష్టంగా కనబడుతోందని సెక్షన్ కావడం, మరి కొందరిని అరెస్టు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలియజేయడంతో రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై పెద్ద ఎత్తున భూ మార్పిడిలు చేశారని తేట తెల్లం అవుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో పెద్ద ఎత్తున భూ కుంభకోణాలు జరిగాయనడంలో సందేహం లేదు. కబ్జాలకు పాల్పడిన రాజకీయ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ దర్యాప్తు మరెంత కాలం కొనసాగుతుందో, ఎవరెవరి భాగోతం బయటపడబోతుందో, ఎవరి భవిష్యత్తు ఎలా ఉండబోతోందో విచారణ అధికారుల్లో ఉంది. అంతవరకు వేచి చూడాల్సి ఉంది. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

వంద శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఒకటో తేదీన వందశాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిఆర్‌డిఎ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, డిపిఒ, ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, ఎల్‌డిఎం తదితర అధికారులతో ఆగస్టు 1 జరగబోయే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,22,313 మంది పింఛను లబ్ధిదారులకు రూ.34 కోట్ల నగదును పంపిణీ చేస్తారని చెప్పారు. జులై 31లోగా నగదు మొత్తాన్ని బ్యాంకుల నుంచి విత్ డ్రా చేసుకోవాలని సూచించారు. గత నెలలో ఏ సిబ్బందితో పింఛన్ల పంపిణీ చేయించారో వారిని మాత్రమే ఈ నెల కూడా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఒ తదితర అధికారులను ఆదేశించారు. వాలంటీర్లని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉపయోగించరాదని ఈ సందర్భంగా తెలియజేశారు. గత నెలలో పింఛన్లను పొందిన లబ్ధిదారులందరికీ ఈ నెలలో కూడా పింఛను అందజేయాలని, ఏ ఒక్కరిని మినహాయించకూడదని చెప్పారు. అందుబాటులో లేని వారు, ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్నారు తప్ప మిగతా 99 శాతం పింఛన్ల పంపిణీ ఒకటో తారీకునే జరగాలన్నారు. జిల్లా ఎల్‌డిఎం ఆంజనేయులును ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకుల మేనేజర్లతో టెలి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసుకొని ఎంపిడిఒలు, ఇతర అధికారులకు జూలై 31లోగా నగదు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు ముందస్తు సమాచారాన్ని టామ్ టామ్, ఇతర మాధ్యమాల ద్వారా అందించి వారు ఇంటి వద్దనే ఉండేలా చూడాలన్నారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు పంపిణీ మొదలు పెట్టాలన్నారు. పింఛన్ల పంపిణీ జరిగేటప్పుడు ప్రజలందరూ గుమి కూడకుండా చూడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు ఏ ఇంటిలో అయితే పింఛను పంపిణీ జరుగుతుందో ఆ ఇంటి వారు మాత్రమే పింఛను పొందేలా చూడాలని, టెంటు వేసి ప్రజలందరినీ గుమి కూడేల చేయకూడదన్నారు. పింఛన్ల పంపిణీ పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్‌ను, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిఎల్‌డిఒ లక్ష్మీపతి, ఎల్‌డిఎం ఆంజనేయులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఎపిఎండిసిలో బెరైటీస్ అమ్మకాలు ప్రారంభించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



మంగంపేట గనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలం పరిధిలో ఎపిఎండిసి సంస్థలో మంగంపేట బ్రాంచ్‌లో బెరైటీస్ డిస్పాచ్ అమ్మకాలు పూర్తిగా నిలిపివేశారని, దీనితో సంస్థ మీద ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆధారపడి జీవిస్తున్న సుమారు 20 వేల మంది కార్మిక కుటుంబాలు, ఉపాధి లేక తినడానికి తిండి లేక ఆకలి కేకలతో అలమటిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామంజులు, హరిశర్మలతో కలిసి శనివారం మంగంపేట ఎపిఎండిసి బెరైటీస్ గనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఇసుక, బెరైటీస్, సర్వే స్టోన్స్, బొగ్గు గనుల్లో, అవినీతి జరిగిందని ,ప్రభుత్వానికి తెలుసు, ఈ అవినీతి పైన విచారణ జరపాలని కోరారు. సుమారు రెండు నెలలుగా బెరైటీస్ అమ్మకాలు, డిస్పాచ్ కొనుగోలు నిలిపివేయడంతో చిన్నచిన్న లారీలు, టిప్పర్లు, మిషన్లు, ట్రాన్స్‌ఫోర్ట్ డ్రైవర్లు, ఓనర్లు రెండు నెలల నుండి జీతాలు లేక పస్తులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, బెరైటీస్ బ్రేకింగ్ చేసే వేల మంది కూలీలు పనులు లేక, జీవనోపాధి కోల్పోయారని తెలిపారు. విదేశాలకు ఎగుమతులు నిలిపివేయడంతో పారిశ్రామిక వేత్తలు వారి వ్యాపారాలు దెబ్బతింటాయని, ఇక్కడ బెరైటీస్ ఇవ్వకుంటే ఇతర దేశాల్లో ఉన్న సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటారని పేర్కొన్నారు. గతంలో ఎపిఎండిసి ఎమ్‌డిగా వచ్చిన శాలిని మిశ్రా చేసిన తప్పిదం వలన, ఎపిఎండిసి సంస్థ కొట్లాది రూపాయలు నష్టం వచ్చి బెరైటీస్ రేటు పూర్తిగా పడిపోయి సంస్థ ఆర్థికంగా పెద్ద దెబ్బ తిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అదే తప్పు ఇప్పుడు చేస్తున్నారని దీనివలన సంస్థకు నష్టం జరిగే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో డిస్పాచ్ రవాణా నిలిపివేస్తే సంస్థ ఉద్యోగస్తులకు, కార్మికులకి, జీతాలు ఇచ్చుకునే పరిస్థితి లేదన్నారు. తక్షణం డిస్పాచ్ ప్రారంభించి 20 వేల కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు లేకుంటే ఇబ్బంది పడుతున్న కార్మికులను వారి కుటుంబాలను కలుపుకుని ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జాతీయ ధర్మాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాయచోటి

సమాజంలో జాతీయ ధర్మాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో గురువందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డైట్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా గురువులను సన్మానించుకోవడం మంచి సాంప్రదాయమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్షులు ఎం.నరసింహులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ గురువులను సన్మానించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.పరశురాం మాట్లాడుతూ భారతదేశంలో వేదవ్యాసుడి నుంచి గురుపరంపర ఉందని పేర్కొన్నారు. గురువులను సన్మానించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.నాగేశ్వరరావు, జూనియర్ కళాశాల లెక్చరర్ జి.వెంకటరమణ, ఎపిఆర్ఎస్ డబ్ల్యు గ్యారంపల్లి ప్రిన్సిపల్ చెన్నకేవులు, వివిధ మండలాల ఉపాధ్యాయులు, సన్మాన గ్రహీతలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న సిపిఐ నాయకులు

రికార్డులను దహనం చేసిన నిందితులను అరెస్టు చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ రికార్డులను దహనం చేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకిని నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ అధికారులు, భూకబ్జాదారులు కలిసి రాజకీయ అండదండలతో వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువులు కబ్జాలు చేశారని ఆరోపించారు. వాటికి నకిలీ రికార్డులను సృష్టించి, 22-ఎ రికార్డులలో గోల్‌మాల్ చేశారని అన్నారు. ఈ సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్న దర్యాప్తు మందకొడిగా జరుగడం పలు అనుమానాలకు తావిచ్చేవిధంగా ఉందన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకులు ఉన్నా పార్టీలకతీతంగా దర్యాప్తు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి కె మురళి, మాధవ్, రెడ్డి, తిరుమల, కమలాకర్, శ్రీనాథ్, రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

దస్త్రాల ఘటనలో నిర్ఘాంతపోయే నిజాలు : ఆర్‌జె

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె లో సంచలనం రేపిన సబ్ కలెక్టర్ కార్యాలయం లోని దస్త్రాల దహనం ఘటనలో నిర్ఘాంత పోయే నిజాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నిమ్మనపల్లి సర్కిల్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ వైసిపి నేతలు చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ మాజీ మంత్రి కుటుంబ సభ్యుల పేరుతో జరిగిన భూ ఆక్రమణలను ఆధారాలతో బయట పెట్టారని అన్నారు. వైసిపి ద్వంద్వ వైఖరి విడాలని హితవు పలికారు. గత మూడు రోజులుగా మాజీమంత్రి పెద్దిరెడ్డి బాధితులు వందలాదిగా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ఫిర్యాదులు చేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ముఖ్యం గా మదనపల్లి మండలం వలస పల్లె లో సర్వే నెంబర్ 55/8,9, లో 3.39 ఎకరాలు అసైన్ ల్యాండ్ ను ఫ్రీహోల్డ్‌లో చేర్చడం జరిగిందన్నారు. అలాగే బికె పల్లి లో 525/1 లో ఇరిగేషన్ చెక్ డ్యామ్ ను పగుల గొట్టి మంత్రి సతీమణి పేరుతో ఫ్రీ హోల్డ్ లో పెట్టారని, అలాగే పరిసర నెంబర్లు అదే విధంగా చేర్చారన్నారు. అంతే కాకుండా రేణిగుంట ఎయిర్ పోర్ట్ సమీపంలో పది ఎకరాలు పెట్టడం వెలుగు చూసిందన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం లో రికార్డులు మాయం చేయడానికి మంటలు రేపారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు విద్యా సాగర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో గెస్ట్ లెక్చర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిజెఎస్ డబ్ల్యు సిమెంట్ లిమిటెడ్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.రాఘవ హరినారాయణ పాల్గొని కన్‌స్ట్రక్షన్ రంగంలో జిజిబిఎస్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరత దృష్టి కోణంలో కాంక్రిట్ ఉత్పత్తిలో జిజిబిఎస్ ఉపయోగించడం మూలంగా ఉత్పన్నమయ్యే కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. పారిశ్రామిక వ్యర్థాలను రిసైకిల్ చేయడానికి సహాయపడుతుందని తెలిపారు. ల్యాండ్ ఫిల్స్‌లో నిక్షిప్తం చేయబడతాయని, అందువలన సహజ వనరులను సంరక్షించడం, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించొచ్చన్నారు. గ్రీన్ కాంక్రీట్ వాటి ఉపయోగాలను తెలియజేస్తూ జిజిబిఎస్‌ను కాంక్రీట్‌లో వాడటం వలన సస్టే యణబులిటి, కట్టడాలలో బలాన్ని పెంపొందించవచ్చన్నారు. అనంతరం గెస్ట్ లెక్చర్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి.నారాయణ, సివిల్ ఇంజి నీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.నరేష్ కుమార్, అనంతపురం సేల్స్ మేనేజర్ అసిఫ్, రాజ్‌కుమార్, అధ్యాపకులు బి.రఘునాథరెడ్డి, ఎస్.వెంకట వరప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన శాఖ మంత్రిని కలిసిన రెడ్డయ్య

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని టిటిడి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు అమావాస్య రెడ్డయ్య కలిశారు. శుక్రవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎస్‌టి సామాజిక వర్గం స్థితిగతులను వివరించారు. ఎస్‌టి సామాజిక వర్గానికి కచ్చితంగా న్యాయం చేయాలని మంత్రి సంధ్యారాణిని కోరామని పేర్కొన్నారు. ఆయన వెంట మనోహర్ నాయక్, మొగిలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలు దేశానికి ప్రమాదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలు దేశానికి ప్రమాదకరంగా ఉన్నాయని అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర కోశాధికారి న్యాయవాది ఎస్.రమేష్‌బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై 'ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్', ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐలు మదనపల్లి కమిటీ ఉపాధ్యక్షులు పివి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తీసుకొచ్చిన చట్టాలు కొనసాగకూడదంటూ వాటి స్థానంలో కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. కొత్త నేర చట్టాల్లో గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. పాత చట్టాలనే పేర్లు మార్చారని, నేడు తీసుకొచ్చిన నూతన నేర చట్టాల్లో కేవలం పది శాతం చట్టాలను మాత్రమే మార్పులు చేశారని వివరించారు. చట్టాలు మార్చినప్పుడు అవి ప్రజలకు మరింత స్వేచ్ఛ, భయాన్ని తొలగించేలా ఉండాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాల్లో అటువంటి ఆనవాళ్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రశ్నించే వారిని నోరెత్తకుండా కఠిన శిక్షలు విధించనున్నారని తెలిపారు. అధికారులకు, పోలీసు వ్యవస్థకు మరిన్నీ అధికారాలు ఇచ్చేలా కొత్త నేర చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటితో సామాన్య ప్రజలు హక్కులు కోల్పోతారని వివరించారు. కొత్త చట్టాలపై పౌర సమాజానికి, న్యాయవాదులకు లోతైన పరిశీలన అవసరమని చెప్పారు. బెయిల్ మంజూరులో మార్గదర్శకాలు, పోలీసు అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లుగా పరిగణించడం, జ్యుడిషియరీ అధికారాలు నియంత్రించేలా నూతన చట్టాలు ఉన్నాయని అన్నారు. కొత్త చట్టాల అమలు ద్వారా న్యాయవాదులకు పలు సవాళ్లు ఎదురుకానున్నాయని తెలిపారు. చట్టాలు రూపొందించే ప్రక్రియ సక్రమంగా జరగలేదని, శాస్త్రీయమైన చర్చ లేకుండా రూపొందించిన చట్టాల వల్ల పౌరసమాజానికి అనర్థం జరుగుతుందని భావించారు. ప్రమాదకరమైన అంశాలను తొలగించడానికి, సవరించడానికి ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. లేనిపక్షంలో భవిష్యత్తు రోజుల్లో ప్రజాస్వామ్య హక్కులను హరించటానికి, పాలకులకు ఈ చట్టాలు ఉపయోగపడతాయనే విషయాన్ని గుర్తించాలని వివరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కోశాధికారి టీ.హరిశర్మ, మదనపల్లి బార్ అసోసియేషన్ కార్యదర్శి బయ్యారెడ్డి, ఐలు జిల్లా నాయకులు కె.సోమశేఖర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మలు మాట్లాడారు. కార్యక్రమంలో ఐలు నాయకులు షాజహాన్, శ్రీనివాసులు, మనోహర్, రమాదేవి, సుజాత, సిఐటియు నాయకులు గంగాదేవి, రాణి, నారాయణ, యువజన సంఘ నాయకులు ఆంజనేయులు, పోతబోలు రెడ్డెప్ప, మాజీ జైలర్ లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు

మర్మమేమిటో!

ప్రజా'దృష్టి'

మదనపల్లి మంటల మరమ్మమేమిటో అంతుచిక్కడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల పాత్ర ఉంటే ఎంత ఉంది, ఏ స్థాయిలో ఉందనే అంశాల్ని ముందుగా తేల్చాలి. ఈదిశగా రాష్ట్ర డిజిపి, సిఐడి చీఫ్, రెవెన్యూ స్పెషల్ సెక్రటరీ స్థాయిలతో కూడిన అధికార యంత్రాంగం కదిలింది. విచారణను వేగవంతం చేసింది. మంటల కారకుల గుర్తింపులో నిమగ్నమైంది. మదనపల్లి పూర్వ ఆర్‌డిఒ స్థాయి అధికార కేంద్రంగా మంటలు ఎగిసి పడుతుండడంపై రాజకీయ కోణం ఉందనే వాదన వినిపిస్తోంది. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ పెద్ద నాయకుని అండ చూసుకుని ఉన్నతాధికారులే రికార్డులు తగలబెట్టారనే ఊహాగానాలు ఉన్నాయి. ఐదేళ్లుగా ఆర్‌డిఒ స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా సాగించిన భూముల పందేరం అనే వాదన వినిపిస్తోంది. డిజిపి, సిఐడి చీఫ్, రెవెన్యూ స్పెషల్ సెక్రటరీతో సహా జిల్లా స్థాయిలో ఐదు విచారణ బృందాల సారథ్యంలో విచారణ వేగవంతం చేశారు. సబ్ కలెక్టర్ తాలూకాలోని 11 మండలాలకు చెందిన తహశీల్దార్లను పిలిపించుకుని విచారణ చేపడుతున్నారు. విచారణలోభాగంగా ఇప్పటివరకు ఒకరి చిన్నస్థాయి ఉద్యోగిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన పాత్రదారులను గుర్తించడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. సిసి టివి రికార్డులు, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా మంటల రోజు, మంటలకు ముందు రోజు ఆఫీసులో ఎవరెవరు ఉన్నారనే కోణంలో అన్వేషణ సాగిస్తోంది. గతేడాది నెల్లూరు జిల్లా న్యాయస్థానంలో రికార్డులను కాల్చి వేసిన సంగతి తెలిసిందే. వారం రోజుల కిందట పుంగనూరు ఎంపిడిఒ కార్యాలయంలో మంటలు చెలరేగడం, తాజాగా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటల చెలరేగి రికార్డులు అగ్నికి ఆహుతి కావడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మదనపల్లి మంటల ఘటన కుట్ర కోణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా విచారణ సాగించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. యాదృశ్చికంగా సంభవించి ఉంటే రికార్డులను భద్రపరచడానికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి. మంటల ఘటనలో కాలిన వాటిలో మాన్యువల్ రికార్డులు మాత్రమే ఉన్నాయా, లేక ఆన్‌లైన్ రికార్డులు సైతం ఉన్నాయా అనే పరిశీలించాల్సి ఉంది. ఆన్‌లైన్ రికార్డులు కాలితే ఆధారాలను ఎలా రూపుమాపగలరో ఆలోచించాలి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆన్‌లైన్ రికార్డులు దగ్గమైతే, సంబంధిత ఉన్నతాధికారులకు చెందిన కార్యాలయాల్లో రికార్డులు ఉండే అవకాశం ఉంది. వాటి ఆధారంగా రికార్డులను తిరిగి తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుంది. మాన్యువల్ రికార్డులను ఆన్‌లైన్ చేయని సంబంధిత అధికారులే మంటల ఘటనకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కుట్రకోణం దాగి ఉంటే టెక్నాలజీ ద్వారా కాలిన రికార్డులను తిరిగి తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ఇటువంటి చిన్నపాటి గ్రహింపు లేకుండానే మంటలు పుట్టించి ఉంటారా అనేది తేలాల్సిన అంశం. ఇందులో ఇతరమేదైనా కుట్రకోణం ఉంటే కుట్రదారులు ఏమి ఆశించి రికార్డులను తగులబెట్టి ఉంటారు.లబ్ధిదారులు ఎవరనే కోణంలో విచారణ సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి



మదనపల్లి: జానపద గీతాలతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలు ఏర్పాటు చేద్దాం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పర్యావరణ పరిరక్షణకై మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకుందామని పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఇఇ పి.శ్రీనివాసులు, ఎఇ అనిల్ కుమార్‌రెడ్డిలు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ ఆధ్వర్యంలో పట్టణంలోని డిసిసిబి బ్యాంక్ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టితో చేసిన వినాయకుడిని మాత్రమే పూజించాలని, మన పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని అన్నారు. ఎవిఐ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత ఆధ్వర్యంలో పాటలు, మాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు, కళాకారులు సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్:** మట్టి వినాయకున్నే పూజిద్దాం.. కాలుష్యాన్ని అరికడదాం అంటూ కళాజాత బృందం తమ పాటలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి వారు మదనపల్లి పురపాలక సంఘం నీరుగట్టువారిపల్లిలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. మట్టితో చేసిన వినాయకుడిని మాత్రమే పూజించి, పర్యావరణ పరిరక్షణ కాపాడుదామంటూ పాటల ద్వారా మదనపల్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీగా ఎం.వి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత సిద్ధేశ్వరుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇశ్రీనివాసులు, ఎఇఅనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

2వ తేదీలోపు పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని 13 గ్రామపంచాయతీలోని పింఛన్ దారులకు 2వ తేదీ మధ్యాహ్నంలోపు పింఛన్లను పంపిణీ చేయాలని ఎంపిడిఒ ప్రభాకర్ తెలిపారు. రామాపురం శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సర్వర్ 1,2వ తేదీలలో మధ్యాహ్నం వరకు పనిచేస్తుందని పింఛన్ లబ్ధి దారులు అందుబాటులో ఉండి పింఛన్లు పొందాలన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్ దారులకు సకాలంలో అంద చేయాలన్నారు.

రేపు రామాపురం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రామాపురం

రామాపురం మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30గంటలకు ఎంపిడిఒ కకార్యాలయంలోని సభాభవనంలో ఎంపిపి విజయ లక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రణాళికలతో హాజరు కావాలని తెలిపారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు,ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.



పిడుగు హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న యల్లటూరు

ఎమ్మెల్సీ 'పిడుగు'ను కలిసిన 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాజకీయ కార్యదర్శిగా ఉన్న పిడుగు హరిప్రసాద్ జనసేన నుంచి తొలి ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత విజయవాడలో వారి కార్యాలయంలో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రాజంపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రస్తుతం వున్న సమస్యలు, పార్టీ కార్యాచరణ మీద ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం : ఎన్నికల సమయంలో రామాపురం తహశీల్దార్‌గా వచ్చిన శ్రీనివాసులు తిరిగి శనివారం సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లారు. కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఈ జిల్లాకు వచ్చినప్పటికీ స్థానికంగా అధికారులు సిబ్బంది ప్రజలు సహకరించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సిద్ధేశ్వరరావు, ఆర్ఐ.రవికుమార్. మండల సర్వేయర్ నాగలక్ష్మి, ఎస్ఐలు, విఆర్ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు నెలలుగా నీటి సమస్య ఏర్పడిన విషయమై శనివారం ప్రజాశక్తిలో 'ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్య తీర్చాలి' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ నాగేంద్ర స్పందించారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నూతన బోరు వేశారు. నీరు పుష్కలంగా రావడంతో మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య, వైద్యసిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



నూతన బోరు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లోకానికి దార్శనికుడు మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం అని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం 9వ వర్ధంతి సందర్భంగా శనివారం తన క్యాంపు కార్యాలయం లో టిడిపి నాకులతో కలిసి కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అతి తక్కువ ధరకే స్టంట్‌ను పరిచయం చేసిన గొప్ప మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. మిసైల్ పరిజ్ఞానంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో మొదటి వరుసలో నిలిపిన ఘనత కలాంకే దక్కుతుందని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న మేధోశక్తిని పెంపొందించడానికి భారతదేశంలోని అత్యంత విద్యావంతులు విద్యను అభ్యసించే ఐఐటి, ట్రిపుల్ ఐటి మొదలగు భారత దేశ విద్యాసంస్థలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సెమినార్స్ ఏర్పాటు చేయించి తద్వారా వారి నైపుణ్యాభివృద్ధికి తోడ్పడేవారని తెలిపారు. ఇటువంటి మహనీయుడు, గొప్ప మేధోశక్తి కలిగిన అబ్దుల్ కలాంను నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో మైనారిటీ వర్గానికి చెందిన ఒక శాస్త్రవేత్తను భారతదేశానికి రాష్ట్రపతిగా ప్రతిపాదించారని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా రాష్ట్ర మాజీ డైరెక్టర్ గుల్జార్‌బాషా, పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె. కరీమ్, మాజీ కౌన్సిలర్ జిలాని భాష, సీనియర్ నాయకులు తుపాకుల బాషా పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని ఎంఇఒ రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఎపి మోడల్ స్కూల్‌లో అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. చిత్రపత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కష్టించి పనిచేయాలని, జ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి, నైతిక విలువలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేటలో శనివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. రక్షణ రంగం, అంతరిక్ష రంగంలోనూ విశేషమైన కృషి చేసి భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరత్నం, ఇంద్రావతి, రాజయ్య, సుకన్య, సురేంద్ర, చంద్రశేఖర్, వెంకట రామిరెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పీడీ బాలశేఖర్ పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానిక పూలమాలవేసి 9వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుటూ కలాం మాజీ రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, ఉపాధ్యాయుడిగా పనిచేశారని, ఆయన దేశ రక్షణ రంగానికి ఎన్నో సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుల్లంపేట: కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : డిఇఒ



పీలేరు : పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న డిఇఒ

ప్రజాశక్తి-పీలేరు

భూమిపై జీవరాసుల మనుగడ సాగాలంటే పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని డిఇఒ శివప్రకాష్ రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ 6వ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ ఏర్పాటు కార్యక్రమానికి డిఇఒ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఓ మొక్కను నాటి నీరు పోసి పెంచాలని పిలుపునిచ్చారు. పర్యావరణ కాలుష్య నివారణ, జీవకోటికి ప్రాణవాయువు అందించడంలో చెట్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రస్తుతం వాహనాలతో పాటు ఇతర అనేక మార్గాల ద్వారా రోజు రోజుకూ కాలుష్యం పెరిగి ఎన్నో అనర్థాలకు దారితీస్తోందన్న ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మానవ తప్పిదాలతో గాలి, నీరు, నేల కూడా కాలుష్యానికి లోనౌతున్నాయని చెప్పారు. సమాజంలో జనాభాకు తగినన్ని చెట్లు కరువౌతున్నాయని, చెట్లు నరకడం వల్ల అడవులు కూడా అంతరిస్తున్నాయని తెలియజేశారు. నేలపై మానవ మనుగడ ఆరోగ్యంగా సాగాలంటే అమ్మ పేరున అందరూ మొక్కలు నాటి వాటిని బాధ్యతగా నీరు పోసి పెంచాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణంలో డిఇఒ మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సోమశేఖర్‌రెడ్డి, పద్మావతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సుండుపల్లి:** మండల కేంద్రానికి సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి నేత గంతల చెన్నకృష్ణ, ఎంఇఒ రవీంద్రనాయక్, హెచ్‌ఎం జయన్న, పిఇటి రవీంద్రనాథ్‌రాజు , పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ శ్రీనివాసులు, పద్మావతి, ఎన్‌డిఎ కూటమి నేతలు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 6వ రోజు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పర్యావరణ సంరక్షణకు కృషి చేయాలన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలని, మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్వీన్, సుధారాణి, వసుంధర, శోభారాణి, నాగరత్న, పుష్పలత, అనురాధ, ఫర్హత్, ఉమాదేవి, రేణుక, షంషాద్, పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని కుందా నెల్లూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కుందా నెల్లూరు గ్రామపంచాయతీని నూకినేనిపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేసినప్పటి నుంచి తాగునీటి మోటర్లకు మరమ్మతుల సమస్యలు ఏర్పడి తమకు తాగునీరు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టర్ గిరీషా వద్దకు వెళ్లి తమ సమస్యను వినియోగించుకోగా డిఎంఎఫ్ నిధుల కింద రూ.12 లక్షలు మం జూరు చేశారన్నారు. ఆ పనిని దక్కించుకున్న కాంట్రాక్టర్ రూ. 7.58 లక్షలు ఖర్చు చేసి బోరు, మీటరు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో పైపులలైన్ వేయించారని తెలిపారు. నీరు వచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని అందుకు రూ.2.56 లక్షలు చెల్లించాలని ఆర్ డబ్ల్యుఎస్ అధికారులకు నివేదిక అందించగా వారు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి డిఎంఎఫ్ అధికారులకు నివేదిక పంపించారని అన్నారు. ఎందుకనో డిఎంఎఫ్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. పైపులైన్ పూర్త య్యి నాలుగు నెలలు కావస్తున్నా తమకు తాగునీరు అందక దాదాపు రెండు కిలోమీటర్ల నుండి పొలంలోని రైతుల మోటార్ల వద్ద నీరు తెచ్చుకుని తాగు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, డిఎంఎఫ్ అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరిం చాలని మహిళలు



ఖాళీ బిందెలను చూపుతున్న మహిళలు

క్షయవ్యాధి నిర్మూలనకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

క్షయవ్యాధి వ్యాప్తి నిర్మూలనకు విద్యార్థులు కూడా కృషి చేయాలని పీలేరు ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక సియన్ఆర్ డిగ్రీ కళాశాలలో పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'వయోజన బిసిజి టీకా – ప్రయోజనాలు' అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అడల్ట్ బిసిజి కార్యక్రమం జయప్రదం విషయంలో తమ కుటుంబం, గ్రామంలో 60 సంవత్సరాలు పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసేవారు, క్షయ వ్యాధిగ్రస్తులతో పాటు వారి కుటుంబ సభ్యులు కచ్చితంగా బిసిజి టీకా వేసుకునేలా సహకరించాలని అన్నారు. విద్యార్థి దశలో సమాజ సేవ అలవర్చుకునే ప్రతి విద్యార్థీ లక్ష్య సాధనలో బాగా రాణిస్తారని, తలుపుల పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహేష్, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి చంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు, సిహెచ్‌ఓ అయేషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మునిసిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేపట్టాలని కోరుతూ శనివారం యూటిఎఫ్ సభ్యులు మదనపల్లె ఉప విద్యాశాఖ అధికారి పురుషోత్తంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ వివేకానంద మున్సిపల్ హై స్కూల్ రామిరెడ్డి లేఅవుట్ లో సుమారు 1,050 మంది విద్యార్థులకు గాను కేవలం ఒకే ఒక్క తెలుగు ఉపాధ్యాయురాలు, ఒకే ఒక్క హిందీ ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని అన్నారు. వాల్మీకి నగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వతరగతి వరకు210 మంది విద్యార్థులు ఉండగా కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. వివేకానంద మున్సిపల్ హై స్కూల్ మాయాబజార్ వీధి నెహ్రూ మున్సిపల్ హై స్కూల్, అమ్మ చెరువు మిట్ట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, చంద్రకాలనీ మున్సిపల్ ప్రాథమికొన్నత పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత విద్యా సంవత్సరం నవంబర్ నెలలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వల్ల అప్పటికే సగం విద్యా సంవత్సరం పూర్తయినందున సబ్జెక్టుల పరంగా విద్యార్థులకు పూర్తిగా న్యాయం జరగడం లేదని డివైఇఒ దృష్టి కి తీసుకెళ్ళారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి స్పందిస్తూ వీలైనంత త్వరలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, మండల పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి సుబ్రహ్మణ్యం, గాలి రవీంద్ర, పయని, మల్లేశ్వర బాబు, సీనియర్ నాయకులు రవి ప్రకాష్, సుధాకర్, విజయ్ కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్యాలపై నాంది ఫౌండేషన్ శిక్షణ

ప్రజాశక్తి-పీలేరు: మహేంద్ర కంపెనీ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ తమ కళాశాల విద్యార్థులకు ఆరు రోజుల పాటు ఉపాధి, నైపుణ్య అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు పీలేరు సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మూడవసంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ నరసింహా రావు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, విశ్లేషణ, నైపుణ్యం, సమాచార నైపుణ్యం, డిజిటల్ మార్కెటింగ్, ఉద్యోగ అవకాశాలపై రాష్ట్రంలో డిగ్రీ విద్యార్థులకు మహేంద్ర కంపెనీ సౌజన్యంతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి సర్టిఫికెట్ ప్రదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ బాబు, నరసింహారావు, ప్రిన్సిపల్‌లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితవాడలలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి

దళితవాడలలో మౌలిక వసతులు కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు యస్. రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆదర్శ రాజేంద్రన్ కలిసి దుశ్శాలువ కప్పి, పూల బొక్కే ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని దళిత వాడలలో సరైన మౌలిక వసతులు లేవన్నారు. ముఖ్యమంగా శ్మశాన వాటికలు లేవని, ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన వారికి పట్టా భూములు పంపిణీ చేయాలన్నారు.ప్రస్తుతం వాతావరణ దృష్ట్యా ప్రబలుతున్న విష జ్వరాలతో అనా రోగ్యాల భారినపడకుండా వారిని కాపాడాలన్నారు. ప్రజలకు మంచి సేవలందించాలని వారుకోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాయచోటి నాయకులు ఎ. నారాయణ, గాలివీడు నాయకులు పుల్లయ్య, చిన్నమండెం నాయకులు బాలాజీ, వీరబల్లి నాయకులు చన్నాయుడు, ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలతో పాటు వడ్డెర విద్యావంతుల వేదిక నాయకులు మారుతి శంకర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు,రాజంపేట

I. P.No 2/2024

ఆకుల రేణుక భర్త అశోక్ కుమార్ ఎస్టేట్ కాలనీ, రాజంపేట టౌన్ & మండలం అన్నమయ్య జిల్లా.

...పిటీషనర్

వర్సెస్

9.K.వెంకటసుబ్బయ్య తండ్రి సుబ్బరాయుడు, మదన గోపాలపురం గ్రామం, రాజంపేట మండలం అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్ నెంబర్ 9

పైన తెలిపిన పిటిషనరు, తనను దివాలాదారుగా తీర్మానించమని, నీపై పై కోర్టులో పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నది. నీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టులో స్వయంగా గాని, లాయర్ ద్వారా గాని 01-08-2024 తేదీన ఉదయం 10:30 కు హాజరై వాదన చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్ //

వి. గురుప్రతాప్ కుమార్ రెడ్డి,
జి. సురేంద్ర
పిటిషనర్ తరపున అడ్వకేట్స్

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు సీనియర్ డివిజన్: రాజంపేట

IA.No:317/2023 in OS.No.37/2017

కొత్తూరు నీరజ భర్త మల్లారెడ్డి చింతలకుంట గ్రామం, నందలూరు మండలం అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్.

...పిటీషనర్/వాది

వర్సెస్

పాలగిరి ఈశ్వరమ్మ భర్త పాలగిరి ఓబుల్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి బెస్తపల్లి గ్రామం పెనగలూరు మండలం అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్ నెంబర్.8

పైన తెలిపిన పిటీషనరు, రెస్పాండెంట్ అయిన మిమ్ముల్ని పార్టీలుగా చేర్చమని పై కోర్టులో పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు మీకు ఎలాంటి ఆక్షేపణలున్న ఎడల 08-08-2024 తేదీన ఉదయం 10:30 కు స్వయంగా గాని లాయర్ ద్వారా గాని పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//

టి రఘునాథరెడ్డి,
అడ్వకేట్,
రాజంపేట



బెల్లంవాండ్లపల్లిలో బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ నజీర్

బెల్లంవాండ్లపల్లిలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని మల్లూరు గ్రామం బెల్లంవాండ్లపల్లిలో చాలా కాలం నుంచి గ్రామ ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇటీవల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరామని పేర్కొన్నారు. మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారని చెప్పారు. అధికారులు జిల్లా పరిషత్ నిధులతో శనివారం బెల్లం వాండ్ల పల్లెలో బోరువేశారని హర్షం వ్యక్తం చేశారు. ఎంతో కాలం నుంచి తాగునీటికి ఇబ్బంది పడే వారమని మంత్రి చొరవతో నీటి సమస్య పరిష్కారం అయ్యిందని తెలిపారు.



రవీంద్రబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూర్వపు ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని గ్రంధివాండ్లపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో పూర్వపు ప్రధాన ఉపాధ్యాయుడు లింగంపల్లి రవీంద్రబాబును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శనివారం ఘనంగా సన్మానించారు. పదవ తరగతి విద్యా సంవత్సరం నందు 2023-24 500 పైగా మార్కుల సాధించిన విద్యార్థులకు 12 మందికి పూర్వపు రవీంద్రబాబు నగదు బహుమతిగా అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు రూ.3116, విద్యార్థులకు, రూ.2116, రూ.1116లు చొప్పున నగదును అందించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి కూడా నగదు బహుమతి ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రందేవాండ్లపల్లి ప్రధానోపాధ్యాయులు చంగ మల్లికార్జున, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దివీడు ప్రధానోపాధ్యాయులు మధుసూదనరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

- బాలికల తల్లిదండ్రులు ఆందోళన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల పరిధిలోని చౌటపల్లి గ్రామ పంచాయతీలోని రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో వెంకటేశ్వర్లు అనే ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పిల్లల శరీరంపై చేతులు వేసి చిన్నారులను హింసిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేయడంతో ఉపాధ్యాయుడు పాఠశాలకు డుమ్మా కొట్టారు. విషయం తెలుసుకున్న ఎంఇఒలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య హుటాహుటిన ప్రాథమిక పాఠశాల చేరుకుని విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు సెలవు పెట్టి వెళ్లినట్లు ఎంఇఒ తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీనిచ్చారు. ఉపాధ్యాయుడిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

ఘనంగా సిఆర్‌పిఎఫ్ 86వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కలికిరి : అన్నమయ్య జిల్లా కలికిరిలోని సిఐఎటి సిఆర్‌పిఎఫ్ 86వ ఆవిర్భావ దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్రిగ్. అనుపమ్ శర్మ (రిటైర్డ్), డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ అమరవీరులకు నివాళులర్పించారు. క్వార్టర్ గార్డ్ వద్ద గౌరవ వందనం స్వీకరించారు. పస్తుతం సంస్థలో పోస్ట్ చేయబడిన అన్ని ర్యాంకులను అభినందించారు. కార్యక్రమంలో నీరజ్ ꞉కుమార్ పాండే, అమర్నాథ్ యాదవ్ లో పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కులం పేరుతో దూషించారని కేసు నమోదు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కల్పనాయుని చెరువు పంచాయతీ గాలంగుండ్లపల్లె దళితవాడకు చెందిన కాసిపోగుల సోనియాను అదే పంచాయతీకి చెందిన చరసాల దిలీప్ కులం పేరుతో దూషించాడని ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎల్‌వి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు.. గాండ్లగుండ్లపల్లి దళితవాడకు చెందిన సోనియా అడపలమాలపల్లె చర్చిలో జరుగుతున్న ఉత్సవాలకు 26న ఉదయంవ్యాన్‌లో అగ్రహారం దళితవాడకు వెళ్లి అక్కడ వున్న పిల్లలను, పెద్దలను మహిళలను చర్చికి రావాలని వ్యాన్‌లో ఎక్కించుకొని వస్తుండగా అదే గ్రామానికి చెందిన చరసాల దిలీపు సైకిల్ మోటార్ పై వెళ్లి వ్యాన్‌ని అడిగించారని అన్నారు. వ్యానులో పిల్లలు, పెద్దలను , మహిళలను ఎక్కడికి తీసుకెళ్తున్నారని సోనియాను అడిగారని పిల్లలను పెద్దలను మహిళలను కడపల మాలపల్లి చర్చికి తీసుకెళుతున్నారని చెప్పడంతో వెంటనే దిలీప్ పిల్లలను పెద్దలను మహిళలను అందరిని మత మార్పిడి చేస్తున్నట్లుగా ఆమెను నిలదీసి, కులం పేరుతో దూషించారని శనివారం రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దిలీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గొల్లపల్లి హైస్కూల్ పనిచేస్తున్న నాగరాజు(62) తమ సొంత గ్రామం పెద్దమండ్యం నుంచి ద్విచక్ర వాహనంలో అతని కొడుకు పృథ్వీరాజ్ ఇద్దరు వారి నాన్నను స్కూల్లో దింపేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కాండ్లమడుగు క్రాస్ దగ్గర వీరి ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో నాగరాజు, అతని కుమారుడు పృథ్వీరాజ్ (35) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని 108లో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.108 సిబ్బంది ఇఎంటి ఉమశ్రీ, పైలట్ రాజు, నాగరాజు పరిస్థితి చాలా విషమంగా ఉంటే తిరుపతికి రెఫర్ చేశారు.

కాంగ్రెస్ నేతకు...

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ కే భాష తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. బాధితుని కథనం మేరకు. మదనపల్లె పట్టణానికి చెందిన ఎస్ కె బాషా స్వతహాగా ఆయుర్వేద వైద్యులు. డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తూనే రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా పనిచేస్తూ రాజకీయాల్లోనూ రాణిస్తున్నారు. ఇదే క్రమంలో గుర్రంకొండ దర్గా పీఠాధిపతిగా కూడా కొనసాగుతున్నారు. దర్గా పనిపై ద్విచక్ర వాహనంలో గుర్రంకొండకు బయలుదేరారు. మార్గమధ్యంలోని రెడ్డికోట వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని 108 లో మదనపల్లె సర్వజన బోధన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న మదనపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డిసాహెబ్, మహబూబ్ పీర్, ఆస్పత్రికి వెళ్లి రెడ్డిబాషాను పరామర్శించి ధైర్యం చెప్పారు.